# 1

# భూతపురి సుబ్రహ్మణ్య శర్మ

## జీవిత రేఖలు

# 1. భూతపురి సుబ్రహ్మణ్య శర్మ జీవిత రేఖలు

## 1:1 భూతపురి వారి వంశం:

క్రీ.శ. 13వ శతాబ్దంలో గోనబుద్దారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాలోని 'బుద్ధపురాన్ని' రాజధానిగా చేసుకొని రాజ్యపాలన చేశాడు. ఈ గోనబుద్దారెడ్డి ఆస్థానంలో భూతపురి సుబ్రహ్మణ్య శర్మ గారి పూర్వీకులు ఆస్థాన కవులుగా ఉన్నారు. వీరి సాహితీ పాండిత్యాన్ని మెచ్చుకొన్న గోనబుద్దారెడ్డి కడప జిల్లా కమలాపురం తాలుకాలోని 'నిడుజువ్వి' గ్రామ పరిసరాల్లో ఉన్న రెండు వందల యాభై ఎకరాల పొలాన్ని ఇనాముగా ఇచ్చాడు. గోనబుద్దారెడ్డి మరణానంతరం భూతపురి సుబ్రహ్మణ్య శర్మ పూర్వీకుల నివాసం 'నిడుజువ్వి'కి మారింది. నిడుజువ్వి వాసులు వీరిని 'బుద్ధపురి' వారని పిలిచేవారు. రాను రాను వ్యవహారంలో 'భూతపురి'గా మారింది.

నిడుజువ్వి నుండే వలస వచ్చిన భూతపురి వంశస్థుల పేర్లు తెలియవు. కాని సుబ్రహ్మణ్యశర్మ తాతగారి తరం నుంచి మాత్రమే తెలిసిన విషయాలను పొందుపరుస్తున్నాను. భూతపురి వెంకటరామశర్మ బహుభాషాకోవిదులు.

'కోదండ రాయ' అనే మకుటంతో శతకాన్ని రచించాడు. 'గయోపాఖ్యానం' అనే నాటకాన్ని రచించాడు. వెంకటరామ శర్మ, సుబ్బమ్మలకు కలిగిన సంతానమే సుబ్బయ్య.(కవితండ్రి)

## 1:2 జననం :

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ కడప జిల్లా వల్లూరు మండలంలోని కొత్తపల్లె గ్రామంలో 14-02-1938 వ సంవత్సరంలో జన్మించాడు. తల్లిదండ్రులు పార్వతమ్మ, సుబ్బయ్య. వీరికి పదమూడు మంది సంతానం. వీరిలో పదవ సంతానం సుబ్రహ్మణ్యశర్మ (కవి) మొదటి ఆరుగురు చనిపోయారు. సుబ్రహ్మణ్యశర్మ, చిన్నసుబ్రహ్మణ్య శర్మ, బాలసుబ్బరాయుడు తప్ప మిగతా వారంతా చనిపోయారు.

## 1:3 బాల్యం :

పార్వతమ్మ సుబ్బయ్యలకు జన్మించిన మొదటి ఆరుమంది చనిపోవడంతో చింతించారు. కనపడిన దేవుళ్ళకంతా తమ గోడును తెలిపారు. అందులో భాగంగానే అనేక పుణ్యస్థలాలు సందర్శించారు. సుబ్బయ్యకు స్వప్నంలో సుబ్రహ్మణ్యస్వామి కన్పించాడు. సర్పదోషముందని చెప్పాడు. మీకు కలిగిన సంతానంలో మొదటి బిడ్డకు తన పేరు పెట్టుకోమని చెప్పాడు. కొన్నాళ్ళకు వీరికి సంతానం కలిగింది. స్వప్నంలో కనిపించిన సుబ్రహ్మణ్యస్వామి సలహా మేరకు సుబ్రహ్మణ్యశర్మ

అని పేరు పెట్టారు. కవిని (సుబ్రహ్మణ్యశర్మ) తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యస్వామి వరప్రసాదంగా భావించారు.

మూడు సంవత్సరాల పసిబిడ్డగా ఉన్న శర్మను ఒక అవధూత చూశాడు. పదమూడవ యేటలో పదమూడు అక్షరాల్ని ఒక ఉత్సాంగుడు ఉపదేశిస్తాడన్నాడు. ఆ ఉపదేశ ఫలితంగానే గొప్ప కవిత్వ కావ్య రచన చేస్తాడని చెప్పినట్టు తన తండ్రి తనతో చెప్పిన విషయాన్ని స్మృతికి తెచ్చుకున్నాడు, సుబ్రహ్మణ్యశర్మ.

## 1:4 విద్యాభ్యాసం :

స్వగ్రామంలో సరైన పాఠశాల లేకపోవడం, మంచి విద్యను (ఇంగ్లీషు) తన కుమారునికి నేర్పించాలనే ఉద్దేశ్యం, భార్య (సుబ్రహ్మణ్యశర్మ తల్లి) ఇరవైఐదవ ఏటనే మరణించడంతో సుబ్రహ్మణ్యశర్మను చదువు కోసం మద్రాసు పంపాడు. అధిక వ్యయానికి ఓర్చుకున్నాడు. ఎలిమెంటరీలో విద్యను అక్కడే పూర్తి చేశాడు.

సుబ్బయ్య సంపాదించిన ఆస్తిపాస్తులు భార్య, పిల్లల అనారోగ్యానికి ఖర్చయింది. మిగిలిన కొంత సొమ్ము సుబ్రహ్మణ్యశర్మ (కవి) మద్రాసులో ప్రాథమిక విద్యకు, మేనమామ పెళ్ళికి ఖర్చు అయ్యింది. అందువల్ల శర్మ విద్యాభ్యాసం మద్రాసులో కాక కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో సాగింది.

ఇక్కడ నివసిస్తున్న సోదరి అనారోగ్యానికి గురికావడం వల్ల శర్మ గారి తండ్రి ఆమెను స్వగ్రామానికి తీసుకెళ్ళాడు. నిరాశ్రయుడైన సుబ్రహ్మణ్యశర్మకు శుభవేల వేంకటసుబ్బయ్య పరిచయమయ్యాడు. తను నిరుపేద అయిన పదిమందికి స్నేహాన్ని, సహాయాన్ని అందించడంలో ధనవంతుడు. ఇక్కడే శర్మకు ఆధ్యాత్మిక తత్త్వం అలవడింది. చెన్నకేశవ ఆలయం నివాసం కాగా, ఆహారం కోసం భిక్షాటన చేశారు. ఇంత కటిక దరిద్రం తాండవిస్తున్నా, బ్రాహ్మ ముహూర్తంలో లేచి రామస్తుతి, అమరం, ఆంధ్ర నామ సంగ్రహం, సుమతీశతకం, భాగవతం చదివేవాడు. పదమూడవ సంవత్సరంలోనే "రామ మంత్రం" ఉపదేశించడం జరిగింది. ప్రొద్దుటూరు పురపాలక ఉన్నత పాఠశాలలో యస్. యస్. యల్. సి. వరకు చదివాడు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న గడియారం వేంకటశేషశాస్త్రి గారంటే సుబ్రహ్మణ్యశర్మకు ఎనలేని అభిమానం, గౌరవం. విద్వాన్ కోర్సును ప్రయివేటు కళాశాలలోను, పండిట్ శిక్షణ కోర్సును ప్రభుత్వ కళాశాలలోను పూర్తి చేశాడు.

## 1:5 ఉద్యోగం :

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ ఆంగ్ల విద్యనభ్యసించి పెద్ద ఇంజనీరు ఉద్యోగం చేయాలన్న తండ్రి ఆశ నెరవేరలేదు. ప్రొద్దుటూరు పురపాలక సంఘ ఉన్నత

యస్.యస్.యల్.సి. పూర్తి చేసిన తర్వాత చిత్తూరులో సర్వే శిక్షణ పూర్తి చేశాడు. సర్వే ట్రైనింగ్ పూర్తి చేయడం వల్ల ఆ డిపార్టుమెంటులో ఉద్యోగం లభించింది. విధినిర్వహణ కోసం బంగారు పాళెం వెళ్లాడు. సున్నిత మనస్కుడైన శర్మ డిపార్టు-మెంటులో జరిగే అవినీతి, లంచగొండితనాన్ని అసహ్యించుకున్నాడు. తను ఆ ఉద్యోగంలో ఇమడలేనని అనుకున్నాడు. ఆ ఉద్యోగానికి శ్రీముఖం పంపాడు.

పండిట్, విద్వాన్ కోర్సులు అభ్యసించడం వల్ల ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యాడు. 12-08-67 వ సంవత్సరం నుండి 12-08-76 వ సంవత్సరం దాకా కడప జిల్లా బద్వేలు తాలూకా చేకూరు పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధ్యాపకుడిగా పనిచేశాడు. తరువాత 1976 వ సంవత్సరం నుండి 1991 వ సంవత్సరం వరకు ముద్దనూరులోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నాడు. ప్రస్తుతం కడప జిల్లాలోని 'చింతలదిన్నెంపాడు' లో ఉన్న జిల్లా ప్రజాపరిషత్ హైస్కూలులో గ్రేడ్-I ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

## 1:6 దాంపత్య జీవితం:

'బిహైండ్ ఎవ్వరి సక్సెస్‌మాన్ దేరిజ్ ఎ వుమన్' అన్న ఆంగ్ల సూక్తికి భూతపురి కృష్ణవేణమ్మ చక్కని

ఉదాహరణకు సుబ్రహ్మణ్యశర్మకు 21-06-59 వ సంవత్సరమున కృష్ణవేణమ్మతో వివాహం జరిగింది. ఈమె తల్లిదండ్రులు లక్ష్మమ్మ రామిరెడ్డి, సూర్యనారాయణశర్మ. వీరిది కడప జిల్లాలోని ఖాజీపేట సాంప్రదాయ కుటుంబం. కృష్ణవేణమ్మ తాత రామిపెద్ది శాస్త్రి వేదాంతిగాను, పంచాంగకర్తగాను పేరెన్నిక గన్నారు.

## 1:7 సంతానం :

సుబ్రహ్మణ్యశర్మ, కృష్ణవేణమ్మలకు నలుగురు సంతానం. నాగకరుణమ్మ, సువర్చలమ్మ అనే ఇద్దరు కూతుళ్లు. శివరామ సురేంద్ర శర్మ, గోపాలకృష్ణశాస్త్రి అనే ఇద్దరు కొడుకులు. కుమార్తెలు ఇద్దరు (బి.ఏ) ఉన్నత విద్యనభ్యసించారు. శివరామ సురేంద్ర శర్మ బి.యస్.సి. పూర్తి చేశాడు. ఇంకొక కుమారుడు గోపాలకృష్ణశాస్త్రి బి.ఏ. చదువుతున్నాడు. కుటుంబ సభ్యులందరికీ సాహిత్యం పట్ల అభిరుచి ఉండటం.

## 1:8 ఇష్టాలు :

భూతపురి సుబ్రహ్మణ్య శర్మకు మహాకవి పోతన్నన్నా, వాల్మీకి రామాయణమన్నా, వ్యాస భారతమన్నా అత్యంత ప్రీతి. పద్య కావ్యాలంటే అమితానందం. పురాణ పురుషు-ల్లో (శ్రీ) రాముడంటే ఎనలేని భక్తి శ్రద్ధలు.

## 1.9 సాహిత్య సృజన :

కవి పూర్వీకులు పండితులు. పేరెన్నికగన్న కవులు. తల్లిదండ్రులు కూడా విద్యావంతులు. వీరు తీరిక సమయాల్లో గ్రామస్థులకు పురాణాలు చదివి వినిపించేవారు. సుబ్బయ్య(కవితండ్రి) ఆధ్యాత్మిక గీతాలతో పాటు భక్తి శ్లోకాలు రచించాడు. అవి ముద్రణకు నోచుకోలేదు. పార్వతమ్మ రాగయుక్తంగా పాటలు పాడేది. ఒక రకంగా సంగీత, సాహిత్యాల కలయికే ఆ కుటుంబం. అలాంటి కుటుంబంలో జన్మించిన సుబ్రహ్మణ్యశర్మ కవిత్వ రచన చేయాలనే ఆకాంక్ష మదిలో మెదిలింది. కోరిక నెరవేర్చేందుకు కృషిచేశాడు. సాహిత్యాన్ని సృష్టించే కర్తవ్య నిర్వహణలో పాలుపంచుకున్నాడు. అలుపెరుగని సాహితీమూర్తిగా నేటికీ రచన వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నాడు. మునుముందు కూడా ఆయన కలం విశ్రాంతి కోరుకోరాదని ఆశిద్దాం.

## 1:10 కవితా గురువులు :

సాహిత్య సాగరంలో ఎంతో మంది శ్రమించారు. వారందరిని స్మరించుకున్నాడు శర్మ. అందుకే సంస్కృతాంధ్ర భాషలలో విశేషంగా పరిశ్రమించిన కవులను పద్యాలనే పూలతో సత్కరించాడు, స్తుతించాడు. వారి సేవలను కొనియాడమని పరోక్షంగా సందేశానిచ్చాడు.

భూతపురి సుబ్రహ్మణ్యశర్మకు అవధాన-

-మంచే అత్యంత ప్రీతి. అందుకే అవధానానికి ఆద్యులైన తిరుపతి వేంకటకవులకు చంపకమాలను, వాలకొలను సుబ్బా-రావుకు ఉత్పలమాలను, జనమంచి శేషేంద్రశర్మకు సీస పద్యాన్ని, వేదం వేంకటరాయ శాస్త్రికి మత్తేభమాలను, రాజశేఖర శతావధానికి ఉత్పలమాలను, సమర్పించాడు.

గడియారం వేంకటశేషశాస్త్రిని, 'సరస్వతీ పుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులను, భూతపురి సుబ్బయ్యని (తండ్రి) తన ఆది గురువులుగా చెప్పుకున్నాడు, సుబ్రహ్మణ్య శర్మ. ఆది గురువు తండ్రి రచనలు చేయమని ప్రేరేపించింది. అయినా. గడియారం వేంకటశేషశాస్త్రి ప్రొద్దుటూరులో ఉపాధ్యా-యుడిగా పనిచేసేటప్పుడు భూతపురి సుబ్రహ్మణ్యశర్మ విద్యార్థిగా ఉన్నాడు. ఎస్.ఎస్.ఎల్.సి. వరకు పాఠాలు చెప్పిన గురువు. పెనుగొండ లక్ష్మి, పండిత భాగవతం, శ్రీనివాస ప్రబంధం, జనప్రియ రామాయణం, మొదలగు రచనలు చదివి వాటికి ప్రభావితుడై పుట్టపర్తి నారాయణాచార్యులను గురువుగా ఎంచుకున్నాడు.

## 1.11 అవధానాలు :

తెలుగు సాహిత్యంలో వెలువడిన వివిధ సాహిత్య ప్రక్రియలలో 'అవధానం' ఒకటి. భూతపురి సుబ్రహ్మణ్య శర్మ అష్టావధానాలు నిర్వహించాడు. శతావధానాలు చేశాడు.

అవధాన నిర్వహణలో బేష్ అనిపించుకున్నాడు. దాదాపు 150 అవధానాలు చేశాడు. సొంత జిల్లా, స్వరాష్ట్రములోనే గాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో నిర్వహించిన అవధానాలలో పాల్గొన్నాడు, సాహిత్యానికి సరిహద్దులేవని చాటి చెప్పాడు. తెలుగువారి సంస్కృతి ఇరుగు పొరుగు రాష్ట్రాలకు వ్యాపింపజేసిన ఘనతలో పాలుపంచుకున్నాడు.

1962 లో పెద్దచప్పల్లి ఉన్నత పాఠశాలలో 'పరమాత్మ(శ్రీ)' కావ్యావిష్కరణ సభ జరిగింది. అందులో భాగాంగనే అవధానం నిర్వహించబడింది. అవధానకర్త సుబ్రహ్మణ్యశర్మ. అవధాన సందర్భంలో శర్మను అవమానింపదలచి "పనులను జేయు బట్టి తగ వర్ణలు గావుత పొట్లలోబడై" అనే సమస్యను అధ్యక్షులకు అందజేసాడు. సమస్యకు స్పందించిన శర్మ తన కావ్యానికి ధన సహాయం చేసిన పసుపుల సుబ్బారావు గొప్పతనా-న్ని క్రింది పద్యంలో చెప్పాడు.

పసుపుల సుబ్బారావు కవి పండిత వర్యుల నాదరించుటన్
ఒకరితి చేయునగ రుజువచ్చినను వంశము కుందువట్టిరే
పసిమిగి చేరుగన్న నవభావ విలాసుడు దాన కావ్యదేరూ
పనులను జేయు బట్టి తగవర్ణలు గావుత పొట్లలోబడై అని

సమయస్ఫూర్తితో సమస్యను పూరించాడు, సుబ్రహ్మణ్యశర్మ. సభికుల అభినందనలందుకున్నాడు.

1981 వ సంవత్సరంలో నెల్లూరులో జరిగిన అవధానంలో సుబ్రహ్మణ్యశర్మ అవధానకర్తగా పాల్గొన్నారు. అష్టావధానం రసవత్తరంగా సాగింది. సభలో పాల్గొన్న మరుపూరు కోదండరామిరెడ్డి శర్మగారి అవధాన ప్రతిభను మెచ్చుకొని స్వామీ! (భూతపురి సుబ్రహ్మణ్యశర్మ) మీరు 'భూతపురి' వారు కాదు 'దేవపురి' వారని ప్రశంసలందుకున్న మహాకవి భూతపురి సుబ్రహ్మణ్యశర్మ.

## 1:12 రేడియో. టివి. ప్రసారాలు :

భూతపురి సుబ్రహ్మణ్యశర్మచే రచింపబడ్డ వ్యాసాలు రేడియో, టివిలలో ప్రసారమయ్యాయి. గగన భారతిలో దాదాపు 50కి పైగా ప్రసారమయ్యాయి. నాకు లభ్యమైనవి మాత్రమే ఇక్కడ పొందుపరచడం జరిగింది. 1. తిక్కన పాత్రౌచిత్యం, 2. అవధానం ఒక పరిశీలన, 3, వ్యాస సంస్కృత భారతం 4, భవభూతి ఉత్తర రామ చరిత్ర వైశిష్ట్యము. 5 జ్యోతిశ్శాస్త్ర ప్రాముఖ్యత 6, అష్టదిగ్గజాలు, 7, రఘునాథీయ కావ్య విశిష్టత, 8 రాణాప్రతాప చరిత్రం. 9, రామాయణ ప్రాశస్త్యం 10. పుట్టపర్తి వారి జనప్రియ రామాయణం 11, తెలుగు భారత అశ్వమేధ పర్వం 12, సూక్తి రత్నావళి, 13, శ్రీకృష్ణరాయభారం మొదలైన ఉపన్యాసాలు ప్రసారమయ్యాయి. తిక్కనవి అలభ్యాలు. ఈనాటికి ప్రసారమయిన శర్మ ఉపన్యాసాలన్నీ

శ్రోతల అభినందనలందుకున్నాయి.

ఆకాశవాణిలోనే గాక దూరదర్శన్‌లో సైతం సుబ్రహ్మణ్యశర్మ ప్రసంగించారు. 1989వ సంవత్సరం ఏప్రిల్ నెలలో 'సాహిత్యంలో గడియారం వారి సేవ' అనే అంశంపై ఉపన్యసించారు. అదే విధంగా 1993వ సంవత్సరంలో 'మంచి మాట' అనే శీర్షికపై ముచ్చటించారు. ఈ రెండు కార్యక్రమాలు శ్రోతలను అలరించాయి. అందుకు వారు అభినందించారు.

## 1.2.1 రచనలు :

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ కలం నుండి పురాణ ప్రబంధ ఇతివృత్తాలతో వెలువడిన రచనలే గాక ఆధ్యాత్మిక తత్త్వాన్ని ప్రతిపాదించే కావ్యాలు, చారిత్రక నేపథ్యం గల పద్య కావ్యాలు కూడా వెలువడ్డాయి. అవి పరమార్థశ్రీ, అహల్యా సంక్రందనం (నాటకం), గాయత్రీ మంత్రార్థం, ఆంధ్రాభ్యుదయం, శ్రీకృష్ణ రక్షణం (నాటకం) శ్రీకృష్ణభారతం, భద్రాచల సుప్రభాతం, మొదలైనవి. ఇవేగాక నాసదీయసూక్తం, కాదంబరి, నవకథా కుసుమాలు అనే అనువాద రచనలు వెలువడ్డాయి.

## 1.2.2 పరమార్థశ్రీ :

శర్మ అతి చిన్న వయస్సులోనే జ్ఞానాన్ని

ఆశ్రించాలనుకున్నాడు, ప్రయత్నించాడు. ఆ యత్నమే 'పరమార్థశ్రీ' రూపంలో వెలువడింది. భూతపురి సుబ్రహ్మణ్యశర్మ శ్రీ శంకర భగవత్పాదులచే రచింపబడ్డ ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రాలను, భగవద్గీత వ్యాఖ్యానాల్ని అధ్యయనం చేశాడు. ఆ సంస్కృత శ్లోకాల అధ్యయన సారమే పరమార్థశ్రీ. కేవలం అరవై ఎనిమిది పద్యాలలో ఉపనిషత్తుల సారం చెప్పడం ఎవరి తరము? అంతటి సమర్థుడు మన శర్మ. అరకప్పు కాఫీ తాగి ఆనందపడే నేటి పాఠకులకు అనువైన రచనగా చెప్పవచ్చు. ఈ 'పరమార్థశ్రీ' లో వివేకచూడామణి, ఆత్మబోధ, అపరోక్షానుభూతి, అను మూడు భాగాలున్నాయి. వీటిలో 'ఆత్మబోధ' విశిష్టమైంది. ఈ పరమార్థశ్రీ రచన చేయడం వల్ల శ్రీ శంకరాచార్యుల బోధనలు తెలుగు పాఠకులకు పరిచయం చేసినట్లయింది. 1962వ సంవత్సరంలో పసుపుల సుబ్బారావు, శాంతమ్మగార్ల సాహాయ్యంతో పుస్తక రూపంలోకి వచ్చింది.

## 1:2.3 నాసదీయ సూక్తం :

ఋగ్వేదంలోని 'నాసదీయ సూక్తము' సుప్రసిద్ధ ఆంగ్లకవి కీట్స్ ఇంగ్లీషులోకి అనువాదం చేశాడు. సుబ్రహ్మణ్యశర్మ ఆంగ్ల అనువాదాన్ని చదివి, అందుకు అవసరమయిన 'సాయణ భాష్యాన్ని' కాశీ నుండి తెప్పించాడు. రెంటిని పరిశీలించి 'నాసదీయ సూక్తం' అనే పేరుతో తెలుగులోకి

అనువదించాడు. అనువాదం చేసిన ప్రతిని ప్రబోధ చైతన్యుల దృష్టికి తీసికెళ్ళాడు. ప్రాచీన సంస్కృతిని పరిరక్షించే గ్రంథంగా గుర్తించి రామకృష్ణ మఠం మైలపూర్ వారు పుస్తక రూపంలోకి తెచ్చారు. తెలుగు పాఠకులు చదవడానికి వీలుకల్పించిన రచయిత ముద్రణా కర్తలు అభినందనీయులు.

## 1:2:4. గాయత్రి మంత్రం : (గాయత్రీ మంత్రార్థం)

సుబ్రహ్మణ్యశర్మచే రచింపబడ్డ మరో రచన గాయత్రి మంత్రం. 'గాతారమ్ త్రాయతే ఇతి గాయత్రీమంత్ర' బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు. అనే మూడు తెగల వారు మాత్రమే ఈ గాయత్రి మంత్ర జపానికి అర్హులన్నారు. ఎందుకంటే ఏషాం ద్విజనామ 'బ్రాహ్మణ క్షత్రియ వైశ్యానామ్' అని పరాశర స్మృతిలో మాధవ విద్యారణ్యస్వాములు సెలవిచ్చారు.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, పుట్టుకతో శూద్రత్వం సంపాదించుకున్న ఏడవ సంవత్సరంలో 'ఉపనయనం' అనే వైదిక కర్మ అవలంభించడము దాక యజ్ఞోపవీతాన్ని వేసి గాయత్రి మంత్రాన్ని ఉపదేశించడం ఆనవాయితీ.

పగటి కాలాన్ని ఉదయ, మధ్యాహ్న, సాయం, సంధ్యలని, మూడు భాగాలు. సంధ్యా దేవత ప్రాతఃకాలంలో గాయత్రీదేవిగా, మధ్యాహ్నంలో సరస్వతీదేవిగా, సాయం కాలాన

సావిత్రీ దేవిగా, ఉంటుందని విజ్ఞుల అభిప్రాయం. ఎవరైతే మూడు సంధ్యలలో గాయత్రి మంత్ర జపాన్ని తుచా తప్పకుండ ఆచరిస్తారో వారు గొప్ప విద్యావంతులు, పండితులవుతారని, సకల అరిష్టాలు హరించి పోతాయని లోకుల నమ్మకం.

గాయత్రి దేవిని స్త్రీ రూపంగా ఆరాధిస్తున్నా, వాస్తవానికి ఈ దేవత (స్త్రీరూపధారిణి) స్వరూపంగా వర్ణింపబడ లేదు. శ్రీ మాధవ విద్యారణ్యులు గాయత్రి దేవిని సూర్యాత్మకమైన తేజస్సుగా, ఈశ్వరాత్మకమైన తేజస్సుగా వ్యాఖ్యానించారు.

గాయత్రి మంత్రంలో ఇరవై నాలుగు అక్షరాలున్నాయి. ఈ ఇరవై నాలుగు అక్షరాల్ని వాల్మీకి ఇరవై నాలుగు శ్లోకాలుగా రచించాడు. రామాయణంలోని ఆరు కాండ-లలో ఈ శ్లోకాలు అక్కడక్కడ చేర్చబడ్డాయి. ఇంత విశిష్టమైన గాయత్రి మంత్రాన్ని లోకాలన్నీ తెలపాలన్న తపన రామకృష్ణ పత్రిక ప్రధాన సంపాదకులకు కలిగింది. సుబ్రహ్మణ్యేశ్వరరావు సరే అన్నాడు. ఫలితంగా గాయత్రి మంత్రం పుస్తక రూపం దాల్చింది. ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి గల వారు దీన్ని అత్యంత ఆదరణీయమైందిగా భావిస్తున్నారు.

## 1:2:5: నమకం చమకం :

యజుర్వేదంలో 'రుద్రము' ఉంది. ఈ రుద్రము రెండు భాగాలు 1. నమకము, 2. చమకము,

పరమేశ్వరుడు త్రిపురాసురులను సంహరించి లోకభీకరుడుగా పేరొందాడు. ముప్పై మూడు కోట్ల దేవతలు ఆ పరమేశ్వరుణ్ణి శాంతింపజేయడానికి నమశ్శబ్దాలతో స్తుతించారు. ఈ స్తుతే 'నమకము'. నమశ్శబ్దాల స్తుతి తరువాత చకారాలతో ప్రార్థించారు. ఆ చకారాల స్తుతే చమకము. ఈ నమక, చమకాలే పరమేశ్వరుని మహాత్మ్యం. నాటి నుండి నేటి వరకు ఈశ్వర దేవాలయాలలో ప్రతి సోమవారం పరమేశ్వరునికి అభిషేకం చేసేటప్పుడు రుద్రాన్ని పఠించడం ఆనవాయితీ. ఎందుకంటే పరమేశ్వరునికి ప్రీతికరమైంది రుద్రం. ఈ రుద్రానికి సంస్కృత సాయణ భాష్యమే గాక అభినవ శంకర భగవత్పాదుల భాష్యం కూడా ఆధారం. సుబ్రహ్మణ్యశర్మ ఈ రుద్రానికి తెలుగులో టీకాతాత్పర్యం రాశాడు. మోక్షేచ్ఛగలవారికి ఈ రుద్ర భాష్యం అత్యంత ఆదరణీయమైంది. నమక చమకములు శివభక్తుల మెప్పును పొందిన రచన

## 1:2:6. 'శ్రీ భద్రాచల సీతారామ సుప్రభాతమ్'

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ సంస్కృతంలో శ్రీ భద్రాచల సీతారామ సుప్రభాతమనే పుస్తకాన్ని రచించారు. ఈ శ్రీ భద్రాచల సీతారామ సుప్రభాతాన్ని కృతికర్త కుమారుడైన శివరామ సురేంద్రశర్మ, గోపాలకృష్ణ శాస్త్రిగార్లు తెలుగులోకి అనువదించారు.

శ్రీ భద్రాచల సీతారామ సుప్రభాతమ్

లో ప్రధానంగా అయిదు ప్రధానాంశాలు చోటు చేసుకున్నాయి. మొదటిది శ్రీ భద్రాచల సీతారామ సుప్రభాతము, రెండవది శ్రీ భద్రాచల రామ స్తోత్రము, మూడవది శ్రీ భద్రాచల రామ ప్రపత్తి, నాల్గవది శ్రీ భద్రాచల రామ మంగళశాసనము, అయిదవది శ్రీ భద్రాచల సీతాదేవి నవరత్నమాల. ప్రధానంగా వసంత తిలక, శార్దూల వృత్తాలతో కూర్చబడింది. వీటితో పాటు అనుష్టుప్ శ్లోకాలు కూడా ఉన్నాయి.

శంకర స్తుతిలో శంకర భగవత్పాదులు 'సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం శివాలింగితం' అని ప్రయోగించగా భూతపురి సుబ్రహ్మణ్యశర్మ శ్రీ రామస్తోత్రములో 'ధ్యాయే భద్రగిరీంద్ర రమ్య నిలయం రామం రమాలింగితమ్'ని ప్రయోగించారు. సీతాదేవి నవరత్నదళాలలో 'వందే భద్రగిరీంద్ర రమ్య నిలయాం త్వాం రామ చంద్రప్రియాం' అని ప్రయోగించారు. ఆధ్యాత్మిక చింతన గల సాహితీ ప్రియులను దృష్టిలో ఉంచుకొని రచించిన రచన శ్రీ భద్రా సీతారామ సుప్రభాతము.

## 1:2:7. ఆంధ్రాభ్యుదయము :

సుబ్రహ్మణ్యశర్మ కలం నుండి వెలువడిన సుప్రసిద్ధ రచనలలో విన్నదగినది ఆంధ్రాభ్యు-దయము. పదమూడవ శతాబ్దంలో ముస్లిం ప్రభువుల పాలనలో

తెలుగు ప్రజల జన జీవన విధానానికి సజీవ రూపం ఈ కావ్యం. అలాంటి సమయంలో హిందూమత సంస్కృతిని పరిరక్షించడానికి విద్యానగర మనే పేరుతో కొందరూ ప్రభువులు రాజ్యాన్ని ఏర్పరచు-కున్నారు. ముస్లిం ప్రభువులను ఎదిరించారు. తెలుగు ప్రజలు గత వైభవాన్ని తిరిగి నెలకొల్పుకున్నారు. ఆంధ్రులు అభ్యుదయాన్ని సాధించారు. అందుకే ఇది ఆంధ్రాభ్యుదయమయ్యింది. ఈ ఆంధ్రాభ్యుదయము పదిహేడు వందల పద్యాలతో అలరారుతున్న కావ్యం. ఎనిమిది ఆశ్వాసాలుగా విభజింపబడింది. దక్షిణ భారత దేశంలో తురుష్క పరిపాలన, సామాజిక పరిస్థితులతో మొదలవుతుంది. విద్యారణ్య స్వామి సలహమేరకు హరిహరరాయలు తుంగభద్రా నది తీరములో 'విద్యాపురం' నిర్మించడం, గంగాదేవిని కోడలుగా స్వీకరించమని విశ్వనాథుడు బుక్కరాయల్ని కోరడం, గంగ కంపరాయల వివాహం, శ్రీరంగంలో రంగస్వామిని తిరిగి ప్రతిష్ఠించడం మొదలైన సంఘటనలు ఈ కావ్యంలో చోటు-చేసుకున్న ప్రధానాంశాలు. ఈ రచన గురించి తరువాత అధ్యాయంలో సమగ్రంగా చర్చించడం జరిగింది.

'ఆంధ్రాభ్యుదయం' 1976 వ సంవత్సరంలో పుస్తక రూపం సంతరించుకుంది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలోని బి.ఏ, బి.కాం, బి.యస్.సి. చదువుతున్న విద్యార్థులకు ఈ కావ్యం పాఠ్యాంశంగా నిర్ణయించడం జరిగింది.

అదే విధంగా 1981-82 వ సంవత్సరంలో బి.ఏ స్పెషల్ తెలుగు చదువుతున్న విద్యార్థులకు పాఠ్యాంశంగా నిర్ణయించారు.

## 1:2:8. శ్రీకృష్ణభారతము :

భూతపురి సుబ్రహ్మణ్యం రచనలలో వెల్ల తెల మాణిక్యం శ్రీకృష్ణభారతం. ఈ కావ్యం ఎనిమిది ప్రకరణాలుగా విభజించడం జరిగింది. శ్రీకృష్ణదేవరాయల జీవిత రేఖలను ఇతివృత్తంగా స్వీకరించి మూడువేల పద్యాలు రాశాడు. ఈ మూడువేల పద్యాల రూపమే శ్రీకృష్ణభారతం.[1] ఈ రచనను పరిశీలించిన మానవ వనరుల శాఖ 25-06-1989న శ్రీకృష్ణభారతాన్ని విశిష్టమైన కావ్యంగా గుర్తించి అభినందిస్తూ ఒక లేఖను రచయితకు పంపారు. ఇది 1991 వ సంవత్సరంలో పుస్తక రూపం దాల్చింది.[2]

నా పరిశోధన భూతపురి సుబ్రహ్మణ్యశర్మ "శ్రీకృష్ణభారతం. ఇంద్రాభ్యుదయం - ఒక పరిశీలన" కాబట్టి ఈ రచనల సమగ్ర చర్చ తరువాత అధ్యాయంలో విశదీకరించడం జరిగింది.

---

1 శ్రీకృష్ణభారతం. పీఠిక - పు 10 డా|| పుట్టపర్తి నారాయణాచార్యులు

2. " 16 "

## 1:3. నాటకాలు :

దృశ్య ప్రక్రియతైన నాటకాలైతే రచయిత తను చెప్పదలచు కొన్న విషయాన్ని సూటిగా చెప్పవచ్చునను కున్నారు ప్రజల్లోకి సాహిత్యాన్ని తీసుకు వెళ్ళే రచయితగా 'నాటక రచన' వైపు తన కలాన్ని మళ్ళించాడు సుబ్రహ్మణ్యేశ్వరశర్మ.

### 1:3:1. అహల్య సంక్రందనం:

అహల్యా సంక్రందనం అనే పౌరాణిక నాటకాన్ని పదునెనిమిదవ ఏటనే రచించాడు,శర్మ. రేడియోలో ప్రసారమైన నాటకాన్ని విన్న శ్రోతలు రచయితకు, ప్రసారం చేసిన గగన భారతి, హైదరాబాదు కేంద్రానికి ప్రశంసలంద- చేశారు.

అహల్యను బ్రహ్మదేవుడు సృష్టించడం, గౌతమునితో వివాహం, దేవేంద్రుడు గౌతముని (మారువేషం) రూపంలో వచ్చి మోహించడం, గౌతముడు తెలుసుకొని శపించడం, శాప విమోచనకు శ్రీరాముని దర్శనం ఈ విషయాలను దృశ్య కావ్యంగా మలచడంలో శర్మ కృతకృత్యుడయ్యాడు. నాటక రచనలో 'బేష్' అనిపించుకున్నాడు. ఈ నాటకంలో కె. సూర్య నారాయణ, జి. వెంకటాచారి, పి. సాంబశివరావు, తుర్లపాటి రామచంద్రరావు, వై.వి. నాగేశ్వరరావు, యస్.వి. విజయకుమార్, నాగవల్లిదేవి, అంటక మొదలైనవారు పాత్రధారులు

## 1:3:2. శ్రీకృష్ణరక్షణము :

చారిత్రక సత్యాలను నాటకంలో చెప్పించటం కష్టమైన పని. చారిత్రక విషయాలను ఉన్నవి ఉన్నట్టుగానే చెప్తే నాటకం రక్తి కట్టదు. అందువల్ల చారిత్రక సత్యాలకు సాహిత్యాన్ని మేళవించారు, రసవత్తరంగా నాటకాన్ని రచించారు. ఇది ఎనిమిది అంకాలుగా విభజింపబడింది.

మహామంత్రి తిమ్మరుసు శ్రీకృష్ణదేవరాయల జాతకాన్ని తల్లిదండ్రులకు చెప్పడం, శ్రీకృష్ణదేవరాయలు శ్రీకృష్ణుని మరో రూపమని ఒక అవధూత చెప్పిన విషయాన్ని నాటకంగా మలిచారు. దృశ్యకావ్యం పండిత పామరులను అలరించే ప్రక్రియ కాబట్టి, చారిత్రక విషయాన్ని దృశ్యకావ్యంగా మలచడం వల్ల నాటి విషయాలను ప్రజల ముందుంచి నట్టయింది. ఇలాంటి చారిత్రక విషయాన్ని ప్రతిబింబించే నాటకం ముద్రణకు నోచుకోక పోవడం విచారింపదగ్గ విషయం. త్వరలో నైనా పుస్తక రూపం దాల్చాలని ఆశిద్దాం.

## 1:4:1 సాహితీ పురస్కారాలు :

వివిధ రంగాలలో విశేషంగా కృషి సల్పిన వ్యక్తులను, సంస్థలను, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు గౌరవించడం పరిపాటి. ఇలా గౌరవించడం వల్ల ఆయా రంగాలలో ఇతరులు కూడా అలాంటి కృషి చేయాలనే

కోరిక మదిలో మెదులుతుంది, ప్రయత్నం జరుగుతుంది. ఆ ప్రయత్నం ఫలిస్తే ఇంకా రంగాలలో అభివృద్ధి అనివార్యం. దాంతో దేశ పురోభివృద్ధి ఖాయం. కాబట్టి ఇలాంటి పురస్కారాలు ఎంతైనా అవసరం, అనివార్యం.

రాయలసీమ ప్రాంతంలోని ఎంతో మంది సాహిత్యక్షేత్రానికి నారుపోశారు. నీరు పోశారు. అలాంటి వారిలో భూతపురి సుబ్రహ్మణ్య శర్మ ఒకరు. సాహితీ సాగులో విశేషంగా కృషి చేసిన భూతపురి సుబ్రహ్మణ్యశర్మను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సత్కరించింది. 1982 వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఆ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఎవెల్ సుబ్రహ్మణ్యశర్మను సత్కరించారు. వారి సాహితీ కృషిని శ్లాఘించారు.

అదే విధంగా నెల్లూరు రోటరీక్లబ్ తరుపున ఆఫిషియల్ జడ్జి వెంగళరెడ్డి శర్మగారి సాహితీ సేవను అభినందించారు. ఘనంగా సత్కరించారు. ఇలాంటి విశేష పురస్కారాలందుకున్న భూతపురి సుబ్రహ్మణ్యశర్మ ధన్యజీవి.

## 1:4:2. బిరుదులు :

చైత్రశుద్ధ దశమి 19-04-76న సుబ్రహ్మణ్యశర్మచే రచింపబడ్డ 'ఆంధ్రాభ్యుదయ కావ్యావిష్కరణ సభ జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహింపబడ్డ

ఈ సభలో అవధానం చంద్రశేఖర శర్మ. షడ్దర్శనం వేంకట సుబ్బావధాన్లు పాల్గొన్నారు. పది సంవత్సరాల సాహిత్య కృషి రూపకమే ఆంధ్రభూష్య దయాళువు. ఈ కావ్యాన్ని షడ్దర్శనం సుబ్బరామశర్మ ఆవిష్కరించారు. కావ్యావిష్కరణ తరువాత సుబ్రహ్మణ్యశాస్త్రి కృతికర్త సుబ్రహ్మణ్యశర్మను 'కవితా-సుధాకర' 'విద్వత్కవులు' కవి భూషణ అనే బిరుదులు ప్రసాదించి ఘనంగా సత్కరించారు. వారి సాహిత్య కృషిని అభినందించారు.

తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి జిల్లా హోసూరు తాలూకాలో రెండు రోజుల పాటు సాహిత్య సాంస్కృతిక సభలు జరిగాయి. వాటిని ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. 10-07-82 న పోతన పంచశత జయంతి, 11-07-82 న శ్రీకృష్ణదేవరాయల 473 వ పట్టాభిషేక మహోత్సవ సభలు వైభవంగా జరిగాయి. 11-07-82 న రాత్రి 10 గంటలకు ప్రముఖ కవి జంధ్యాల పాపయ్యశాస్త్రి అధ్యక్షతన అష్టావధానం జరిగింది. అవధాన-కర్త భూతపురి సుబ్రహ్మణ్యశర్మ. భూతపురి గారి అవధాన ప్రతిభకు మురిసి పోయిన కరుణశ్రీ 'అవధాని వాచస్పతి' అనే బిరుదునిచ్చాడు. సీస, తేటగీతి, శార్దూల, కంద పద్యాలనే కుసుమాలతో ఘనంగా అభినందించాడు.

కడప రచన సాహిత్య వేదిక జిల్లాలో సాహిత్య పరంగా కృషి చేసిన వారికి సన్మానాలు జరపడం, రచనలు చేసే వారిని ప్రోత్సహించడం, రచనలు వెలుగు చూడ-టానికి ప్రయత్నించడం లాంటి ఉదాత్తమైన కార్యక్రమాలు రచన సాహిత్య వేదిక నిర్వహిస్తుంది.

అందులో భాగంగానే భూతపురి సుబ్రహ్మణ్య శర్మకు మహాకవి గడియారం వేంకటశేష శాస్త్రి అవార్డుకు ఎంపిక చేశారు. పుట్టపర్తి నారాయణాచార్యుల అధ్యక్షతన 20-09-82 న సాహితీ సభ జరిగింది. ఈ సభలో సభాధ్యక్షులు మహాకవి గడియారం వేంకటశేష శాస్త్రి అవార్డును సుబ్రహ్మణ్య శర్మకు బహుకరించారు. ఈ సభలో ప్రముఖ సాహితీవేత్త వై.వి. సుబ్బారాయుడు పాల్గొన్నారు.

1989 వ సంవత్సరం జూలై 13వ తేదీన జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆధ్వర్యంలో రామకృష్ణ జూనియర్ కాలేజి, కడపలో 'శ్రీకృష్ణ భారతం' కావ్యావిష్కరణ సభ జరిగింది. అందులో భాగంగానే శ్రీకృష్ణ భారతాన్ని పల్లకీలో కడప పట్టణమంతా ఊరేగించారు. ఈ ఆవిష్కరణ సభలో సరస్వతి పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు, షడ్దర్శనం సుబ్బరామయ శర్మ, వై.ఎస్. రాజన్న, తుమ్మపూడి కోటీశ్వరరావు, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు

పేర్వారం జగన్నాథం, రవ్వా శ్రీహరి (కేంద్రీయ విశ్వవిద్యాలయం) కేశూరి అనంత పద్మనాభరావు మొదలైన వారు పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవ రాయలు అల్లసాని పెద్దనకు గండపెండేరము తొడిగినట్లు, శ్రీకృష్ణ భారత కృతికర్త భూతపురి సుబ్రహ్మణ్య శర్మ గారికి సత్కార కమిటీ ఛైర్మన్ పుల్లగూర నటరాజ ఎనిమిది తులాల (40 వేల ఖరీదయిన) బంగారు గండపెండె-రము తొడిగారు. 'కవిసార్వభౌమ' అనే బిరుదునిచ్చి ఘనంగా సత్కరించారు. సభలో ప్రసంగించిన వక్తలు శర్మగారి సాహిత్య సేవను అభినందించారు.

భూతపురి సుబ్రహ్మణ్య శర్మ 1987 వ సంవత్సరంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎన్నికయ్యారు. అందువల్ల రామస్వామి రెడ్డయ్య, ఆర్.డి.ఓ 5-9-1987 న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేసారు. అదే విధంగా 1989 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. అందుచేత అప్పటి విద్యా-శాఖామాత్యులైన శ్రీ. సీతాదేవి 5-9-1989 న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును బహుకరించింది.

కడప జిల్లాలో ఎక్కువ సంఖ్యలో అవధానాలు చేసిన వారిలో సుబ్రహ్మణ్య శర్మ ఒకరు. అందుకు ఉదా. అష్టావధాన కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టరు, పి.సుబ్ర-

సుబ్రహ్మణ్యం 'భూతపురి' గారిని 4-10-92 న ఘనంగా సత్కరించారు. అభినందించారు. ఇంకా అధిక సంఖ్యలో అవధానాలు నిర్వహించా-లని కోరారు. అవధాన ప్రక్రియ కడప జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత రూపం దాల్చాలని ఆకాంక్షించారు.

అల్లసాని పెద్దన ఎంప్లాయీస్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సొసైటీ 30-09-92 నుండి 4-10-92 వరకు అయిదు రోజుల పాటు 'ఆంగీరస శరత్కాల కవితా సౌరభాలు' అనే పేరుతో సాహిత్య ఉపన్యాసాలు నిర్వహించింది. అందులో భాగంగా భూతపురి సుబ్రహ్మణ్య శర్మ వ్యాస మహర్షుల కవితా వైభవం, కవిత్రయంలో కవితా వైభవం. పోతన, ఆంధ్రవాల్మీకుల (వావికొలను సుబ్బారావు) కవితా వైభవం. అష్టదిగ్గజాలలో అల్లసాని పెద్దన కవితా వైభవం, అనే అంశాలపై ప్రసంగించారు. అయిదవ రోజున అవధానం జరిగింది. అవధాన కర్త భూతపురి సుబ్రహ్మణ్య శర్మ.

సాహిత్య సరస్సు, నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 01-04-93 నుండి 03-04-93 వరకు రామాయణ, మహాభారత గీతోపన్యాసాలు జరిగాయి. అల్లసాని పెద్దన సాహితీ పీఠాధ్యక్షులు - కవి సార్వభౌమ - మహాకవి - శతావధాని, బ్రహ్మశ్రీ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ ఉపన్యాసకులుగా పాల్గొన్నారు. శ్రీమద్రామాయణం, మహాభారతం,

భగవద్గీతలపై ప్రసంగించారు.

## 1:4:3. వ్యక్తిత్వం :

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ కవి, పండితుడు, విమర్శకుడు. శర్మ తల్లిదండ్రులు ఆధ్యాత్మిక చింతన దైవభక్తి కలవారు. కావడం చేత పుట్టుకతోనే ఈ రెండు లక్షణాలు అలవడ్డాయి. దానికి తోడుగా ప్రొద్దుటూరులో చదువుకునేటప్పుడు మద్దివేటి వెంకటసుబ్బయ్యతో పరిచయం కావడం, రామాయణం, భారతం, భాగవతం, లు చదవడం, వాటి గురించి ఆలోచించడం, ఈ ఆలోచనవల్ల తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకున్నాడు. ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి కాగానే చిత్తూరులో సెక్రటేరియట్ ట్రైనింగ్ పూర్తిచేసి, ఆ డిపార్టుమెంటులో చేరాడు. కాని ఎక్కువ కాలం ఆ ఉద్యోగ నిర్వహణలో ఇమడలేకపోయాడు. కారణం ఆ డిపార్టుమెంట్లో జరిగే అవినీతి, లంచగొండితనం, సున్నిత మనస్కుడైన శర్మ వాటిని చీదరించుకున్నాడు. జీవనానికి ఆధారమైన ఉద్యోగానికి ప్రముఖాలు సమర్పించాడు. ఇది ఆయన ఉన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తుంది. అందరిని ఆప్తుల్ని చేసుకొనే మంచితనం ఆయనది. నిరంతరం సాహిత్యాన్ని అధ్యయనం చేయడం, తెలిసిన విషయాల్ని పదిమందితో పంచుకోవాలని తపించే ప్రశాంత సాహితీ పిపాసి, భూతపురి సుబ్రహ్మణ్యశర్మ.